

పుష్పాకృతిలో పద్మాసనాలు ప్రదర్శిస్తున్న విజయవాడ సంస్థ చిన్నారులు



శవాసనం వేస్తున్న ఏడేళ్ల చిన్నారి నిత్యాశ్రీ



50 ఏళ్లు పైబడిన మహిళ ప్రదర్శిస్తున్న శవాసనం



దివ్యాంగుడు తలశిల రాముకు సర్టిఫికెట్ అందిస్తున్న కలెక్టర్

ఉత్సాహంగా జలయోగా

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నాగాయలంక శ్రీపాద క్షేత్రం వద్ద కృష్ణానది బ్యాక్ వాటర్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జలయోగా కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన సాధకులు నీటిలో తేలియాడుతూ ప్రదర్శించిన ఆసనాలు ప్రేక్షకులను అబ్బురపరిచాయి. పరిసర ప్రాంత ప్రజలు జలయోగా విన్యాసాలను ఆసక్తిగా తిలకించారు. డీఆర్వో చంద్రశేఖర్, డెప్యూటీ కలెక్టర్ పోతురాజు, ఆర్డీఒ స్వాతి, డీఎస్‌డీఓ ఝాన్సీలక్ష్మి, నియోజకవర్గ ప్రత్యేకాధికారి పి.సాయిబాబు, తహసీల్దార్ ఎం.హరనాథ్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ తోట బాలాజీ, సి.ఐ పి.యువకుమార్, ఆయుష్ అధికారులు వాహిని, శేష ప్రసన్న, ఇతర జిల్లా అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

– నాగాయలంక



బెలూన్‌లు ఎగురవేసి జలయోగా ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధరరావు, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

క్లుప్తంగా

ప్రశాంతంగా డీఎస్సీ పరీక్ష

పెడన: మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో డీఎస్సీ పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రాజారమేష్, ఆడ్మిన్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగన ఈ పరీక్షకు 180 మందికి గాను 172 మంది హాజరయ్యారని, 8 మంది ఆబ్సెంట్ అయ్యారని తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన రెండో సెషన్‌లో 180 మందికి గాను 176 మంది హాజరయ్యారని, నలుగురు ఆబ్సెంట్ అయ్యారన్నారు. రెండు సెషన్స్‌లలో 360 మందికి గాను 348 మంది హాజరవ్వగా 12 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్ష జరిగిందని వారు పేర్కొన్నారు.

యోగా సాధనలో విద్యార్థులు



బంటుమిల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని అధ్యాపకులు, విద్యార్థులు బుధవారం యోగా సాధన చేశారు. ప్రిన్సిపాల్ డాక్టరు ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో అధ్యాపకులు, విద్యార్థులు కలిసి యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యోగా సాధన ప్రతివ్యక్తి జీవితంలో శారీరక, మానసిక ఉల్లాసాన్ని ఇస్తుందన్నారు.

దివిసీమ ఉప్పెనలో ప్రభాకర్‌జీ సేవలు మరువలేనివి

అవనిగడ్డ: దివిసీమ ఉప్పెన సమయంలో సర్వోదయ నాయకుడు, మహాత్మాగాంధీ అనుచరుడు ప్రభాకర్‌జీ అందించిన సేవలు ఎన్నటికీ మరువలేనివని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. స్థానిక గాంధీక్షేత్రం కమిటీ ఆధ్వర్యంలో ప్రభాకర్‌జీ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పెన మృతుల సామూహిక అంత్యక్రియలు నిర్వహించేందుకు ప్రభాకర్‌జీ శవసేవ కార్యక్రమం చేపట్టారన్నారు. గాంధీక్షేత్రం అధ్యక్షుడిగా ప్రభాకర్‌జీ అందించిన సేవలు అందరికీ ఆదర్శనీయమన్నారు. గ్రామీణ యువజన సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రావ్, కమిటీ ప్రధాన కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీకొని ఇరువురికి గాయాలు

కోనేరుసెంటర్: కారు, బైక్ ఢీకొనటంతో ఇరువురు యువకులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానికులు 108లో మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించారు. చిలకలపూడి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మచిలీపట్నం డ్రైవర్స్ కాలనీకి చెందిన పి.పవన్‌కుమార్, కాలేఖాన్‌పేటకు చెందిన కె. సాంబశివరావు కలిసి బుధవారం రాత్రి బైపాస్‌రోడ్డు లక్ష్మీటాకీస్ సెంటర్ నుంచి వెళుతుండగా లక్ష్మీటాకీస్‌సెంటర్ హౌసింగ్‌బోర్డుకాలనీ వైపు వస్తున్న కారు, బైక్ డీమార్ట్ సమీపంలో ఢీకొన్నాయి. ఈ ఘటనలో పవన్‌కుమార్, సాంబశివరావు తీవ్రంగా గాయపడ్డారు. బైక్ నుజ్జునుజ్జు కాగా, కారు ముందుభాగం దెబ్బ తింది. గాయాలపాలైన ఇరువురిని స్థానికులు మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఇరువురిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలించినట్లు పోలీసులు తెలిపారు.

కొరమేను చేపల సాగు ప్లాంట్ ప్రారంభం



చిట్టూర్పు(ఘంటసాల): కొరమేరు చేపలు సాగు చేయడం ద్వారా డ్వాక్రా మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధించి పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. మండలంలోని చిట్టూర్పు శివారు చాట్రగడ్డవాని గూడెం ఎస్సీ కాలనీలో రాంకీ ఫౌండేషన్ సీఎస్ఆర్ మేనేజర్ చాట్రగడ్డ మహేంద్రబాబు విజ్ఞప్తి మేరకు రాంకీ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎంపీ రామిరెడ్డి తమ సంస్థ సీఎస్ఆర్ నిధులు రూ.4.41 లక్షలతో ఉదయ్ ఆక్వా కనెక్ట్ సంస్థ సాంకేతిక సహకారంతో డ్వాక్రా మహిళ కొడాలి వెంకటక్ష్మి నూతనంగా ఏర్పాటు చేసిన కొరమేను చేపల ఉత్పత్తి ప్లాంటను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఉదయ్ ఆక్వా కనెక్ట్స్ ఎండీ ఉదయ్ కిషన్ మాట్లాడారు. చిట్టూర్పులో పట్టాభి మెమోరియల్ సహకారంతో పుట్ట గొడుగుల ఉత్పత్తి శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ ప్రారంభించారు. సర్పంచ్ గూడపాటి వెంకటేశ్వరరావు, పట్టాభి మెమోరియల్ ప్రతినిధి డాక్టర్ స్వర్ణశ్రీ, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ హరిహరనాథ్, ఇన్‌చార్జి ఏపీఎం టి.శ్రీనివాసరావు, తుమ్మల చౌదరి బాబు, నేతలు గుత్తికొండ వర ప్రసాద్, పరుచూరి సుభాష్ చంద్రబోస్, గొర్రెపాటి రామకృష్ణ, నీటిసంఘం అధ్యక్షుడు దాసరి సతీష్ బాబు, ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు దిరిశం వెంకట్రావు, సుగ్గున పవన్ కుమార్, పాటిబండ్ల నరేష్, చాట్రగడ్డ నాంచారయ్య, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

రైతులే స్వచ్ఛందంగా..

- అధ్వానంగా బందకోడు మైనర్ డ్రెయిన్
- ప్రతి ఏటా ముంపు సమస్య
- స్వచ్ఛందంగా డ్రెయిన్ బాగుచేయించుకుంటున్న రైతులు
- డ్రెయిన్ ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు తొలగించాలని వినతి



చెరువులను తలపిస్తున్న పొలాలు (ఫైల్)

బంటుమిల్లి: ఎవరో వస్తారని ఎదురు చూడలేదు.. అధికారులు బాగు చేయిస్తారన్న నమ్మకం లేదు. ఎకరాలనికి ఇంత అని వాటాలు వేసుకున్నారు.. రైతులే స్వచ్ఛందంగా డ్రెయిన్‌ను బాగుచేయించుకునేందుకు నిర్ణయించుకున్నారు. ఆ మేరకు పనులు మొదలు పెట్టారు.

అధ్వానంగా డ్రెయిన్

మండల పరిధిలోని నాగేశ్వరరావుపేట పంచాయతీ శివారు జానకీరామపురం- ములపర్రు గ్రామాల మధ్య ఉన్న బందకోడు మైనర్ డ్రెయిన్‌లో పేరుకుపోయిన తూడు, చెత్త, చెదారాలను రైతులు స్వచ్ఛందంగా తొలగించే పనులు బుధవారం చేపట్టారు. ఈ డ్రెయిన్ సమీపంలో నివాసులు ఇళ్లలోని చెత్తాచెదారాలను డ్రెయిన్‌లో వేసి నీటి ప్రవాహానికి ఆటంకం కలిగిస్తున్నారు. డ్రెయిన్లు మరమ్మతులు చేయాల్సిన నీటి సంఘ నాయకులు సమస్యను పట్టించుకోకపోవడంతో రైతులే వర్షపు నీటితో చెరువుల్లా ఉన్న తమ పంట పొలాలను కాపాడుకునేందుకు నడుం బిగించారు. ఎకరాల లెక్కన డబ్బులు వసూలు చేసుకుని కూలీలతో డ్రెయిన్‌లో తూడు, చెత్త, చెదారాలను తొలగించే పనులు చేపట్టారు.



బందకోడు మైనర్ డ్రెయిన్‌లో తూడు తొలగిస్తున్న కూలీలు

ప్రతి ఏటా సమస్యే..

ఈ డ్రెయిన్ కారణంగా ప్రతి సంవత్సరం పెద్ద ముంపు సమస్య వస్తోందని, డ్రెయిన్ ఆక్రమణకు గురికావడంతోపాటు స్థానికులు చెత్తాచెదారాలు డ్రెయిన్‌లో వేస్తూ తమకు ఇబ్బంది కలిగిస్తున్నారని, రైతు కాగిత కుమార్ ఆవేదన వ్యక్తం చేశాడు. అసలే సాగు భారంగా ఉందని, దీనికి తోడు డ్రెయిన్ల మరమ్మతుల ఖర్చులు అదనంగా ఉంటున్నాయని ఆయన చెప్పారు. విత్తనాలు చల్లిన తర్వాత భారీ వర్షం కురిస్తే పరిస్థితి తలుచుకుంటే భయంగా ఉందని పలువురు రైతులు విచారం వ్యక్తం చేశారు.

ఆక్రమణలయినా తొలగించాలి

అధికారులు స్పందించి బందకోడు మైనర్ డ్రెయిన్ ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు తొలగించి పంట పొలాలు ముంపుబారిన పడకుండా చర్యలు తీసుకోవాలని డ్రెయిన్ పరిధిలోని రైతులు కోరుతున్నారు.

రహదారి మార్జిన్ల పటిష్టతకు చర్యలు

కొండరాళ్లతో రక్షణ కల్పించే పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

కోడూరు: నిర్మాణదశలోనే కుంగిపోతున్న రహదారి మార్జిన్లను పటిష్ట పర్చేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు ఎట్టకేలకు చర్యలు చేపట్టారు. కోడూరు– అవనిగడ్డ ప్రధాన రహదారిని రూ.16.80 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్నారు. అయితే రహదారి నిర్మాణదశలో ఉండగానే కృష్ణాపురం- జయపురం, జయపురం- వి.కొత్తపాలెం గ్రామాల మధ్య నూతన రహదారి మార్జిన్ కాలువ వైపు కుంగిపోయింది. ఆరు చోట్ల మార్జిన్లు భారీ మొత్తంలో నెర్రలిచ్చి రహదారి అంచు భాగం కూడా దెబ్బతింది. ఈ విషయాలపై ఈ నెల 15న 'సాక్షి' దినపత్రికలో 'రహదారి మార్జిన్‌కు బీటలు' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులు వెంటనే మార్జిన్ పటిష్టత పనులకు శ్రీకారం చుట్టారు. మార్జిన్లు కాలువ వైపు కుంగిన ప్రాంతాల్లో కొండరాళ్లతో రక్షణ కల్పించే పనిలో నిమగ్నమయ్యారు. మార్జిన్ బీటలు వారిన ప్రాంతంలో సుమారు మీటరు లోతున గ్రావెల్‌ను తొలగించి ఈ కొండరాళ్లతో పటిష్టత పనులు చేపట్టనున్నట్లు ఆర్ అండ్‌బీ డీఈ రమేష్ తెలిపారు. రహదారి అంచులు దెబ్బతిన్న ప్రాంతాలతో పాటు బీటలు వారిన ప్రాంతాల్లో మరమ్మతులు చేయనున్నట్లు చెప్పారు.



మార్జిన్లు పటిష్ట పర్చేందుకు సిద్ధం చేసిన కొండరాళ్లు

16 చోట్ల రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు..

ప్రమాదాల నివారణకు కోడూరు– అవనిగడ్డ ప్రధాన రహదారిపై రంబుల్ స్ట్రిప్స్‌ను అధికారుల ఆదేశాలతో గుత్తేదారు ఏర్పాటు చేశారు. 13 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణం జరగ్గా, పలు ప్రాంతాలను యాక్సిడెంట్ స్పాట్స్‌గా గుర్తించారు. వాహనాల వేగం తగ్గించేందుకు 16 చోట్ల రంబుల్ స్ట్రిప్స్‌ను ఏర్పాటు చేశారు. మీతిమిరిగిన వేగంతో వాహనాలు వెళ్లకుండా ఉండేందుకు కూడా స్ట్రిప్స్ దోహదపడతాయని అధికారులు చెప్పారు.

జెడ్పీటీసీ మాజీ సభ్యుడికి సింహాద్రి పరామర్శ



ఎదురుమొండిలో మాజీ జెడ్పీటీసీ నాగరాజు, సోదరులను పరామర్శిస్తున్న రమేష్‌బాబు తదితరులు

ఎదురుమొండి(నాగాయలంక): గ్రామంలో మాతృ వియోగం పొందిన జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కన్నా నాగరాజు, సోదరులను, కుటుంబ సభ్యులను అవనిగడ్డ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే, సింహాద్రి రమేష్‌బాబు బుధవారం పరామర్శించారు. నాగరాజు మాతృమూర్తి కన్నా ముత్యాలమ్మ అనారోగ్యంతో రెండు రోజుల క్రితం మరణించిన విషయం తెలుసుకుని ఎదురుమొండి దీవికి వచ్చి ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



టి.కొత్తపాలెంలో శ్రీనివాస్‌తో మాట్లాడుతున్న రమేష్‌బాబు

పార్టీ కార్యకర్త కుటుంబానికి రమేష్ పరామర్శ

మండలంలోని టి.కొత్తపాలెం వైఎస్సార్ సీపీ గ్రామ నాయకుడు పూషడపు అంకాలు కుమారుడు శ్రీనివాస్‌ను పరామర్శించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతితో కోలుకుంటున్నాడు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని సింహాద్రి అడిగి తెలుసకుని ధైర్యంగా ఉండాలని సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు భోగాది శేషగిరిరావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మద్ది చిన్నారి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు తోట సాయిబాబు, పాపారావు, తదితరులు ఆయన వెంట ఉన్నారు.

డ్రెయినేజీ పనులు త్వరగా పూర్తి చేయండి

జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

యండకుదురు(ఘంటసాల)/చల్లపల్లి: వర్షాలు మొదలై వ్యవసాయ పనులు ప్రారంభమైన నేపథ్యంలో డ్రెయినేజీ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలజీ అధికారులను ఆదేశించారు. 216 జాతీయ రహదారి వెంబడి ఉన్న మచిలీపట్నంలోని సత్య కన్వెన్షన్ వద్ద శివగంగ, ఘంటసాల మండలం యండకుదురు వద్ద ఐనంపూడి ప్రధాన డ్రెయిన్, చల్లపల్లి మండలంలోని గుండేరు ప్రధాన డ్రెయినేజీలను జిల్లా కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధిక వర్షాలు కురిసినపుడు ముంపుతో రైతులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ముందుగానే మురుగు కాలువల్లో గుర్రపు డెక్క, తూటికాడ, కిక్కిస వంటి గడ్డిజాతి మొక్కలను తక్షణమే తొలగించాలన్నారు. ముందుగా ప్రాధాన్యత కలిగిన సాగునీటి మురుగు కాలువలకు పనులను, తర్వాత మిగిలిన డ్రెయిన్ల పనులు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ పులిగడ్డ అక్విడెక్ట్ వద్ద జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. అక్విడెక్ట్‌కు రెయిలింగ్, ఫ్లోరింగ్ తదితర పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ మోహనరావు, కేసీ డివిజన్ ఈఈ రవి కిరణ్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



గుండేరు డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఇతర అధికారులు

శ్రీసత్యసాయి ప్రేమరథయాత్ర ప్రారంభం



పెడన మండలం బల్లిపర్రులో రథయాత్రకు స్వాగతం పలుకుతున్న భక్తులు

మచిలీపట్నంటౌన్: శ్రీ సత్యసాయిబాబా 100వ జన్మదినోత్సవం సందర్భంగా శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో చేపట్టిన శ్రీ సత్యసాయి ప్రేమ రథయాత్ర కార్యక్రమం బుధవారం వైభవంగా ప్రారంభమైంది. స్థానిక చిలకలపూడిలోని శ్రీ పాండురంగస్వామి వారి ఆలయం నుంచి ఈ రథయాత్ర ప్రారంభమైంది. ఉదయం ఆలయ ఆవరణలో ప్రత్యేక పూజల నడుమ రథయాత్రను ప్రారంభించారు. మంగళ వాయిద్యాలు, డీజేలో స్వామి పాటలతో, వేద పారాయణ అనంతరం పూర్ణ కుంభంతో స్వామికి భక్తులు స్వాగతం పలికారు. ఈ రథయాత్ర నగరంలోని చిలకలపూడి నుంచి నగరంలో పలు ప్రాంతాల మీదుగా భక్తుల స్వాగత కార్యక్రమాలు స్వీకరిస్తూ పర్యటించి పెడనకు తరలి వెళ్లింది. ఈ నెల 21వ తేదీ వరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రేమరథయాత్ర సాగనుంది. ఈ సందర్భంగా నగర వాసులు రథయాత్రకు మంగళ హారతులు పట్టారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయకుమార్ పర్యవేక్షించారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.



తోటమూలలో మహిళల స్వాగతం

పెడన: భగవాన్ శ్రీసత్యసాయిబాబా 100వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీసత్యసాయి సేవాసంస్థలు ఏర్పాటు చేసిన శ్రీ సత్యసాయి ప్రేమరథయాత్ర బుధవారం సాయంత్రం పెడనకు చేరుకుంది. ఈ రథయాత్ర మండల పరిధిలోని బల్లిపర్రు గ్రామంలో పర్యటన అనంతరం పెడన పట్టణంలోని తోటమూలకు చేరుకుంది. తోటమూల సెంటరులోని అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథయాత్రకు సత్యసాయిబాబా భక్తులు ఘనస్వాగతం పలకడంతో పాటు నైవేద్యాలను సమర్పించారు. తీన్‌మార్ వాయిద్య మేళాలతో, విద్యార్థుల కర్రసాములు, విద్యార్థినిల నృత్యాలు, కోలాటాలతో భక్తుల పాదయాత్ర నడుమ భారీ ఊరేగింపుగా రథయాత్ర కొనసాగింది. తోటమూల సెంటరు నుంచి బయల్దేరి మార్కెట్‌యార్డు మీదుగా బంటుమిల్లి రోడ్డు సెంటరు, బస్టాండు సెంటరుకు చేరుకుంది. శ్రీగణపతి, శ్రీఆంజనేయస్వామి ఆలయం వద్ద రథయాత్ర నిలిపి సత్యసాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెడన సత్యసాయిసేవా సంస్థ ప్రతినిధులు, భక్తులు, చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సరి హద్దులు దాటితే చర్యలు



చల్లపల్లి: నిబంధనలను అతిక్రమించి సరిహద్దులు దాటి ఇసుకను అక్రమంగా తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కృష్ణా జిల్లా మచిలీపట్నం ఆర్డీవో స్వాతి, బాపట్ల జిల్లా రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి హెచ్చరించారు. ఆర్డీవోలు ఇరువురూ బుధవారం చల్లపల్లి మండల పరిధిలోని ఆముదార్లంక ఇసుక క్వారీని పరిశీలించారు. బాపట్ల జిల్లా జువ్వలపాలెం వాసులు సరిహద్దును దాటి కృష్ణా జిల్లా పరిధిలో ఉన్న ఆముదార్లంక ఇసుక క్వారీలో నుంచి ఇసుకను తరలించుకుపోతుండటంతో ఆముదార్లంక వాసులకు, జువ్వలపాలెం వాసులకు తరచూ సరిహద్దు విషయమై స్పర్థలు తలెత్తేవి. దీంతో ఇరుప్రాంతాలకు చెందిన ఆర్డీవోలు రంగంలోకి దిగి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు ప్రారంభించారు. ఆర్డీవోల సమక్షంలో రెవెన్యూ, పోలీసు అధికారులు సర్వే చేయించి ఆముదార్లంక ఇసుక క్వారీలో సరిహద్దులు నిర్ణయించారు. కొన్ని రోజుల్లో సరిహద్దు రాళ్లు కూడా ఏర్పాటు చేసి సరిహద్దు సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇసుక తవ్వకాలు నిషేధం ఉన్న ఆముదార్లంక ప్రాంతం నుంచి ఎడ్లబండ్లు, ట్రాక్టర్లపై ఇసుకను తరలించినా చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతులు ఉన్న క్వారీల నుంచే ఇసుకును తరలించుకోవాలని సూచించారు. తహసీల్దార్లు డి.వనజాక్షి, వెంకటేశ్వరులు, పోలీసులు, రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

ఘంటసాల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కృష్ణాజిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ శర్మిష్ఠ బుధవారం ఆకస్మిక తనఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఘంటసాల పెద్దగూడెంలో మంజూరైన వెల్‌నెస్ సెంటర్ నిధులు మంజూరు కాగా బేస్‌మట్టం దశలో ఆగిందని, ప్రస్తుతం ఆస్థలం ఇరుకుగా ఉన్నందున మరొక స్థలం చేసి బడ్జెట్ మంజూరు కాగానే వెల్‌నెస్ సెంటర్ నిర్మాణం పూర్తి చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఘంటసాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు బాగున్నాయన్నారు. పేషెంట్లు ఎక్కువగా వస్తున్నా వారి వివరాలు ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు (ఈహెచ్ఆర్) ఆన్‌లైన్ తక్కువగా ఉంటుందని పూర్తి స్థాయిలో ఆన్‌లైన్ చేయాలని సూచించారు. పీహెచ్‌సీలో వైద్య సేవల పట్ల డాక్టర్ శర్మిష్ఠ సంతృప్తి వ్యక్తం చేసి వైద్యులు, సిబ్బందిని అభినందించారు. ఘంటసాల పీహెచ్‌సీకి మొదటిసారి వచ్చిన సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ వేమూరి ప్రమోద్ కుమార్, సిబ్బంది శాలువాతో సత్కరించారు. ముందుగా పెద్దగూడెంలోని నిర్మాణ దశలో ఆగిన వెల్ నెస్ సెంటర్‌ను డాక్టర్ శర్మిష్ఠ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సీనియర్ అసిస్టెంట్ పీఏఎం కుమార్, ఫార్మసిస్టు ఆఫీసర్ సీహెచ్.కృష్ణ, ఎంపీహెచ్ఏ సీహెచ్.శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు కె.పూర్ణచంద్రరావు, ఎం.శివకృష్ణ, స్టాఫ్ నర్సు వి.రాణి, ఎల్టీ దివ్యజ్యోతి, రాజి, సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ

కొడాలి నాని అరెస్ట్ అవాస్తవం

జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు

కోనేరుసెంటర్: వైఎస్సార్ సీపీ నాయకుడు, రాష్ట్ర మాజీ మంత్రి కొడాలి నానిని కృష్ణాజిల్లా పోలీసులు అరెస్ట్ చేశారంటూ సోషల్‌మీడియాలో జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు తెలిపారు. కొడాలి నానిపై ఉన్న కేసులకు సంబంధించి కలకత్తా ఎయిర్‌పోర్టులో పోలీసులు అరెస్ట్ చేశారంటూ సామాజిక మాధ్యమాల వేదికగా వస్తున్న వార్తలు పక్కా అవాస్తవమన్నారు. కొడాలి నానిని నిజంగా అరెస్ట్ చేసినట్లైతే తాము అధికారికంగా అందరికీ తెలియజేయటం జరుగుతుందన్నారు. సామాజిక మాధ్యమాలతో నిరాధారమైన మెసేజ్‌లను పోస్టు చేయటం సరైన విధానం కాదన్నారు. అలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్పీ హెచ్చరించారు.

ఎంఏవో బాధ్యతల స్వీకరణ

కృత్తివెన్ను: మండల వ్యవసాయశాఖాధికారిగా పి.మాధురికిరణ్ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. కంకిపాడు మండలంలో పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన జెన్నీ పెడనకు బదిలీపై వెళ్లారు. బుధవారం కొత్తగా వచ్చిన ఏవో మాధురీకిరణ్ ఆధ్వర్యంలో చినపాండ్రాకలో 'పొలంపిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు.